క్లుప్తంగా

నేడు విజయవాడలో మహాధర్నా

ఏలూరు (టూటౌన్): క్విట్ ఇండియా దినోత్సవం రోజు 9వ తేదీన క్విట్ మోదీ సేవ్ ఇండియా నినాదంతో కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకు, విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగంలోనే కొనసాగాలని, నాలుగు కార్మిక కోడ్‌లకు వ్యతిరేకంగా, అధిక ధరల నియంత్రించాలని, నిరుద్యోగ సమస్య పరిష్కరించాలని, కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, భారత దేశ లౌకిక రాజ్యాంగాన్ని కాపాడాలని, మణిపూర్ రాష్ట్రంలో శాంతి భద్రతలు కొనసాగించాలనే తదితర డిమాండ్ల సాధనకు మహాధర్నా ఏర్పాటుచేశామని తెలిపారు.

కొబ్బరి కొనుగోలు కేంద్రాలను తెరవాలి

ఏలూరు (టూటౌన్): కొబ్బరికాయల కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేసి రైతుల నుంచి కొబ్బరి కాయలను కొనుగోలు చేయాలని కోరుతూ కొబ్బరి రైతుల సంఘం, ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీల ఆధ్వర్యంలో మంగళవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం జిల్లా కలెక్టరేట్, ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయాల్లో డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రాలను అందజేశారు. ఏపీ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వై.కేశవరావు, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు మాట్లాడారు. కొబ్బరి రైతుల సంఘం నాయకులు బొల్లి రామకృష్ణ, పి.అచ్యుతరామయ్య, గంటా పాపారావు, ఎ.నాగేశ్వరరావు, గుడిబండి రమేష్ రెడ్డి, వైవీ కృష్ణారావు, ఎస్‌బీవీ ప్రసాద్, గుడిబండి వీరారెడ్డి, నంబూరి జనార్ధనరావు పాల్గొన్నారు.

వైద్యవిద్యలో ఉన్నత లక్ష్యాలను సాధించాలి

దెందులూరు: మైనర్ పంచాయతీ అయిన సానిగూడెంలో సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ (విష్ణు), విజయలక్ష్మి దంపతుల కుమారుడు రామసాయిమణికంఠ చైనాలో వైద్య విద్య పూర్తి చేసి స్వగ్రామానికి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శాలువా, పూలదండలతో ఘనంగా సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ ఏకాగ్రత, పట్టుదలతో వైద్యవిద్యలో ఉన్నత లక్ష్యాలను సాధించి స్వగ్రామానికి, స్వదేశానికి మంచిపేరు తీసుకురావాలని, దీనికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తానన్నారు. సర్పంచ్ సనిపల్లి రామకృష్ణ మాట్లాడుతూ కొఠారు కుటుంబానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు, సొసైటీ చైర్మన్ పెదబాబు, స్థానిక నాయకులు ఉన్నారు.

ఎంపీ శ్రీధర్‌కు సత్కారం

దెందులూరు: ఆల్‌ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ డిప్యూటీ చైర్మన్‌గా నియమితులైన ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌ను మంగళవారం ఎంపీ కార్యాలయంలో ఏపీ లిడ్‌క్యాప్ కార్పొరేషన్ డైరెక్టర్ సొంగా సందీప్ అభినందించి జ్ఞాపికను అందజేశారు. ఎంపీ శ్రీధర్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో ఫుట్‌బాల్ క్రీడకు మరింత వన్నె లభిస్తుందని, ప్రతిభగల యువతను ప్రోత్స హించడంలో ఆయన ముందున్నారన్నారు.

పుస్తకాల పంపిణీ

దెందులూరు: చిన్నారులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల బాటలో పయనిస్తూ ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని దెందులూరు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ జీ. అమ్మన్‌రాజా అన్నారు. మంగళవారం దెందులూరులో ఆర్‌సీఎం ఏలూరు పీఠాధిపతి పొలిమేర జయరావు ఆదేశాల మేరకు మండలంలో ఏడు గ్రామాలకు చెందిన పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న 420 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను ఉచితంగా ఫాదర్ అమ్మన్‌రాజా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫాదర్ మాట్లాడుతూ ఏటా ఉచితంగా విద్యార్థులందరికీ నోట్ పుస్తకాలు అందిస్తున్నామని తెలిపారు.

చురుగ్గా మెడికల్ కాలేజీ హాస్టల్ నిర్మాణం

- ఏలూరు జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాక్‌పై నిర్మాణం
- రూ.20 కోట్లతో 32 వేల చదరపు అడుగుల్లో వసతి
- విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా బ్లాక్‌ల ఏర్పాటు



ఏలూరు సర్వజన ఆసుపత్రి ఎంసీహెచ్ బ్లాక్ పైఅంతస్తులో హాస్టల్ నిర్మాణం



హాస్టల్‌లో గదుల నిర్మాణం



తుది దశకు టాయిలెట్ల నిర్మాణం

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల అనుబంధ హాస్టల్ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని ఎంసీహెచ్ బ్లాక్ పైన రెండు అంతస్తుల్లో తాత్కాలికంగా మెడికల్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఏపీ మెడికల్ సర్వీస్ ఇన్‌ఫ్రా అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎంఎస్ఐడీసీ) పర్యవేక్షణలో మెడికల్ విద్యార్థులకు అన్ని వసతులతో హాస్టల్‌ను యుద్ధప్రాతిపదికన నిర్మిస్తున్నారు. సెప్టెంబర్ మొదటి వారంలో మెడికల్ విద్యార్థులకు క్లాస్‌లు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈనెలాఖరులోగా నిర్మాణాలు పూర్తి చేసేలా ప్రత్యేక చర్యలు చేపట్టారు.

రూ.20 కోట్లతో సౌకర్యాలు

ఏలూరు ప్రభుత్వ మెడికల్ కళాశాల భవనాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రాంగణంలో ఏర్పాటు చేయగా, హాస్టల్ భవనాలను ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలోని ఎంసీహెచ్ బ్లాక్ పైఅంతస్తులో నిర్మిస్తున్నారు. సుమారు రూ.20 కోట్ల నిధులతో ఏపీఎంఎస్ఐడీసీ శరవేగంగా నిర్మాణాలను పూర్తి చేసేలా చర్యలు చేపట్టింది. తొలుత వేరే ప్రాంతంలో తాత్కాలిక వసతి కల్పించాలని భావించినా ప్రైవేటు భవన యజమానులు అధికంగా అద్దెలు డిమాండ్ చేయడంతో ఈ నిర్ణయాన్ని విరమించుకున్నారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ నిత్యం మెడికల్ కాలేజీ నిర్మాణాలపై సమీక్షిస్తున్నారు.

150 బెడ్ల ఏర్పాటు

ఏలూరు జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ బ్లాక్ పైఅంతస్తులో నిర్మిస్తోన్న హాస్టల్‌లో 150 మంది విద్యార్థులకు సరిపడా బెడ్లు ఏర్పాటు చేస్తున్నారు. సుమారుగా 32 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో హాస్టల్, గదులను ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో గదిలో ఇద్దరికి బెడ్లు, ప్రత్యేకంగా టాయిలెట్స్ ఉంటాయి. హాస్టల్‌లో వ్యక్తిగత మరుగుదొడ్లతోపాటు, అదనంగా రెండు బ్లాక్స్‌కు మరో 40 టాయిలెట్లను ఏర్పాటు చేశారు. బాలికలు, బాలురకు వేర్వేరుగా బ్లాక్‌లు ఏర్పాటు చేశారు. హాస్టల్‌లోకి వెళ్లేందుకు సైతం వేరుగా మెట్ల దారిని ఏర్పాటు చేశారు.

వేగంగా శాశ్వత భవనాల నిర్మాణం



ఏలూరు జీజీహెచ్ ప్రాంగణంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థులకు నాలుగు అంతస్తుల్లో బాలికలు, బాలురకు వేర్వేరుగా శాశ్వత భవనాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మరో నాలుగు నెలల్లోనే వాటిని అందుబాటులోకి తెచ్చేందుకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నాం. ఇక ఎంసీహెచ్ బ్లాక్ పైఅంతస్తులో తాత్కాలికంగా హాస్టల్ గదులను ఏర్పాటు చేస్తున్నాం. మెడికల్ విద్యార్థులకు అన్ని వసతులూ కల్పించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ఇద్దరికి ఒక గదిలో బెడ్లు ఏర్పాటు చేయటంతోపాటు, మరుగుదొడ్డి సౌకర్యం కల్పిస్తున్నాం.

– డి.బలరామిరెడ్డి, ఎస్ఈ, ఏపీఎంఎస్ఐడీసీ

గద్దర్ మృతి సాహితీ రంగానికి తీరని లోటు

ఏలూరు (టూటౌన్) : ప్రజా గాయకుడు, విప్లవ కవి గద్దర్ మృతి కళాకారులకు, సాహితీ రంగానికి, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని ప్రజానాట్యమండలి గాయకుడు, ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఏలూరు జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు ఒక ప్రకటనలో తెలియజేశారు. గద్దర్ జన నాట్యమండలి వ్యవస్థాపకుల్లో ఒకరని, తన గాత్రంతో తెలుగు రాష్ట్రాల ప్రజలను తనదైన శైలిలో ఉర్రూతలూగించారని కొనియాడారు. మా భూమి సినిమాలో నటించడమే కాకుండా పలు సినిమాలకు పాటలు రాశారన్నారు. నీ పాదం మీద పుట్టుమచ్చనై చెల్లెమ్మా పాటకు రాష్ట్ర ప్రభుత్వం నంది అవార్డును ప్రకటించినా గద్దర్ దాన్ని సున్నితంగా తిరస్కరించారని ఆదిశేషు తెలిపారు. ప్రజాఉద్యమాలలో గద్దర్ తన పాటలతో ప్రజలను ఉత్తేజ పరిచే వారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమంలో తన పాటలతో ఆ ఉద్యమానికి ఊపు తెచ్చారని ఆదిశేషు తెలిపారు. గద్దర్ మృతిపై ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

కొనసాగిన దీక్షలు

ఏలూరు (టూటౌన్) : సమస్యలు పరిష్కరించాలంటూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా వీఆర్ఏల చేస్తున్న నిరాహార దీక్షలు రెండో రోజు మంగళవారం కొనసాగాయి. వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు కె.బ్రహ్మాజీ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వీఆర్ఏలు మోకాళ్లపై నిల్చుని తమ నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడి ప్రసాద్, సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, కోశాధికారి గంగాధర్ రావు, ఆంజనేయులు, రవికుమార్, కాలేషా, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

ఎమ్మెల్యే ఆళ్ల నాని



లబ్ధిదారుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాని, చిత్రంలో కార్పొరేటర్ అఖిల, పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్

ఏలూరు టౌన్: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని అన్నారు. మంగళవారం ఏలూరు వన్‌టౌన్‌లో 105వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మూడో డివిజన్ కార్పొరేటర్, స్మార్ట్ సిటీ మాజీ చైర్‌పర్సన్ బొద్దాని అఖిల, వైఎస్సార్‌సీపీ ఏలూరు నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నాని లంబాడీపేట సచివాలయం 59 ప్రాంతంలోని సత్యనారాయణ పేట, వెన్నవల్లివారిపేట కాలువగట్టు, పుల్లల అడితి సెంటర్‌లో నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాల అమలుపై ఆరా తీశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక లోపంతో అర్హులకు సంక్షేమ పథకాలు అందకపోతే వాటిని సరిచేసి పథకాలు అందజేసేలా శ్రద్ధ వహించాలని నాని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఏనాడు లేనివిధంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల పేరుతో ఒక్కో కుటుంబానికీ లక్షలాది రూపాయలు నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేశారని తెలిపారు. చంద్రబాబు హయాంలో 2.64 లక్షల కోట్లు అప్పులు చేసి ఒక్క పథకాన్నైనా పేద ప్రజలకు ఇచ్చారా అని ప్రశ్నించారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు మేలు చేయాలనే సంకల్పంతో కృషి చేస్తుంటే, ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని, ప్రతిపక్షాల కుట్రలను ప్రజలు గుర్తించాలని కోరారు. రాబోయే 2024 ఎన్నికల్లో చంద్రబాబు, ఇతర రాజకీయ పార్టీ నాయకులు చేసే అరాచకాలు, నీచ రాజకీయాలను తిప్పికొట్టాలని నాని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు, పార్టీ సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, ఏఎంసీ వైస్ చైర్మన్ కంచన రామకృష్ణ, కార్పొరేటర్లు నున్న స్వాతిశ్రీదేవి, జిజ్జువరపు విజయనిర్మల, డింపుల్‌జాజ్, పిల్లంగోళ్ల శ్రీదేవి, తుమరాడ స్రవంతి, పొలిమేర దాసు, ఆర్.సత్తిబాబు, జున్నూరు నరసింహారావు, సుంకర చంద్రశేఖర్, తంగెళ్ల రాము, గరికిముక్కు జయకర్, యర్రంశెట్టి నాగబాబు, సబ్బన శ్రీనివాస్, గుడిపూడి శ్రీనివాస్, యర్రంశెట్టి సుమన్, కలవకొల్లు సాంబ, వాణిజ్య విభాగం నాయకులు మోటమర్రి సదానందం, హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఎండీ కైసర్, ఇనపనూరి జగదీష్, బీసీ నాయకులు కిలాడి దుర్గారావు, జనపరెడ్డి కృష్ణ, సేవాదళ్ నాయకులు యల్లాపు మోజెస్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి నాయకులు వైఎస్‌వీ శివరావు, పిట్టా ధనుంజయ్ తదితరులు ఉన్నారు.

మైక్రో ఆర్టిస్ట్ శివప్రసాద్‌కు అభినందన



మైక్రో ఆర్టిస్ట్ శివప్రసాద్‌కు సర్టిఫికెట్ అందజేస్తున్న మెప్మా పీడీ

ఏలూరు (టూటౌన్): పీఎం స్వానిధి పథకం ద్వారా రుణాన్ని తీసుకుని సక్రమంగా చెల్లించినందుకు మైక్రో ఆర్టిస్ట్ డి.శివప్రసాద్‌కు మెప్మా పీడీ బి.ఇమ్మానియేలు సర్టిఫికెట్ అందజేశారు. స్థానిక నగరపాలక సంస్థ ఆవరణలో మంగళవారం వీధి విక్రయదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. పీఎం స్వానిధి రుణాలను సక్రమంగా చెల్లించిన వీధి విక్రయదారులను సన్మానించారు. 2010 నుంచి వీధి విక్రయదారుల సంఘాన్ని ఏర్పాటుచేసిన శివప్రసాద్ ఎంతో మంది విక్రయదారులకు లైసెన్స్‌లు, పథకాలు అందేటట్లు కృషి చేశారు. శివప్రసాద్ కూడా వీధి విక్రయదారునిగా కొనసాగుతున్నారు. ఈ సందర్భంగా ఆయన్ని బ్యాంకు అధికారుల సమక్షంలో మెప్మా పీడీ అభినందించారు. సర్టిఫికెట్‌ను అందజేశారు. తనను గుర్తించి సర్టిఫికెట్ అందించడం ఆనందంగా ఉందని శివప్రసాద్ అన్నారు.

మతోన్మాదంతో శాంతిభద్రతలకు విఘాతం



క్రైస్తవ, ముస్లిం, దళితుల ఐక్య సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): దేశంలో మతోన్మాద శక్తుల వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతోందని క్రైస్తవ, ముస్లిం, దళితుల ఐక్య సమావేశం ఆందోళన వ్యక్తం చేసింది. నగరానికి చెందిన ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక అంజుమన్ ముహాఫిజుల్ ఇస్లాం సంస్థ సమావేశ మందిరంలో మంగళవారం ఆయా వర్గాల ఐక్య సమావేశం నిర్వహించారు. ప్రతినిధులు మాట్లాడుతూ మనిపూర్, హర్యానా, జైపూర్, ముంబయ్ రైలు ఘటనలపై ఆందోళన వ్యక్తం చేశారు. వివిధ రాష్ట్రాల్లో హత్యాకాండలు, సజీవ దహనాలు, దారుణాలు ఎంతో ఆవేదన కలిగిస్తున్నాయని వాపోయారు. మణిపూర్‌లో ఒక మహిళను నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేయడం, మహిళల హిజాబ్ విషయంలో వివక్ష చూపడం బాధాకరమన్నారు. ముఖ్యంగా క్రైస్తవులను, ముస్లింలను, ఎస్సీ, దళిత ప్రజలను లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం వెనుక మతోన్మాద శక్తుల ప్రమేయం కనిపిస్తోందని వివరించారు. రాబోయే రోజుల్లో మతోన్మాద శక్తులకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ముస్లిం, క్రైస్తవ, దళితులు రాజకీయంగా మరింత ఎదగాల్సిన అవసరం ఉందని, అందరూ ఐక్యంగా ఉండి సంఘవ్యతిరేక శక్తులను దేశం నుంచి పారదోలాలని, రాబోయే రోజుల్లో ఒక ఐక్యవేదిక ఏర్పాటు చేసుకుని పోరాడాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో జేఏసీ అధ్యక్షుడు ఎస్కే ఇబ్రహీం, ఉపాధ్యక్షుడు ఎండీ ఇలియాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజా అహ్మద్, కార్యదర్శి ఎస్కే అన్వర్, అంజుమన్ సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ సులేమాన్, ఎస్కే అమీర్ జానీ, ప్రచార కార్యదర్శి ఎండీ ఎగ్బాల్, కోశాధికారి ఎండీ ముజీబ్, ఎండీ ఆరిఫ్, జయ్యద్ జాన్, బిషప్ ఓమారావు పొలిమేర తదతరులు పాల్గొన్నారు.

దళిత సేన హర్షం



కార్యక్రమంలో నినదిస్తున్న అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ తదితరులు

ఏలూరు (టూటౌన్): మణిపూర్ రాష్ట్రంలో మహిళలపై జరిగిన హత్యలు, అత్యాచారాలు, హింసపై సమగ్ర దర్యాప్తు నిమిత్తం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ధర్మాసనం విశ్రాంత మహిళా జడ్జిలతో కమిటీ వేయడాన్ని దళితసేన రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ హర్షం వ్యక్తం చేశారు. ఆర్ఆర్‌పేటలోని రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు జోక్యంతో మణిపూర్‌లో స్త్రీలు, మానవ హక్కులను కాపాడేందుకు, శాంతియుత వాతావరణం నెలకొనే విధంగా కృషి చేస్తున్నందుకు సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో దళిత సేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నామినేషన్ల స్వీకరణ



గుడివాకలంకలో నోటీసు ప్రదర్శిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్: గ్రామ పంచాయతీ ఉప ఎన్నికల్లో భాగంగా ఏలూరు మండలంలో అధికారులు ఎన్నికల నిర్వహణ ప్రక్రియ ప్రారంభించారు. మంగళవారం ఉదయం గుడివాకలంక, కలకుర్రు గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో నామినేషన్ల స్వీకరణ నోటీసులు ప్రదర్శించారు. ఈ నెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11, 12, 13 తేదీల్లో పరిశీలన, 14 తేదీలోపు ఉపసంహరణ ప్రక్రియ ఉంటుందని పేర్కొన్నారు. గుడివాకలంక 8వ వార్డు సభ్యుడు శోభన్‌బాబు మృతి చెందడంతో ఆ స్థానానికి ఎన్నిక నిర్వహిస్తుండగా, కలకుర్రు 8వ వార్డు ఎస్సీలకు కేటాయించినప్పటికీ గతంలో ఎవ్వరూ నామినేషన్ వేయకపోవడంతో అధికారులు మరోసారి ఎన్నికల చేపట్టారు.

నేడు రైతులకు ఆయిల్‌పామ్ మొక్కల పంపిణీ

దెందులూరు: రామారావుగూడెంలో మేడికొండ కొండయ్య పొలంలో రైతులకు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఆధ్వర్యంలో బుధవారం ఆయిల్ పామ్ మొక్కలను పంపిణీ చేస్తారని వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని తెలిపారు. రైతులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.

లక్ష్యాలు నెరవేర్చాలి

దెందులూరు: వెల్ఫేర్ అసిస్టెంట్లు అంకితభావంతో విధులు నిర్వర్తించి శాఖాపరమైన విధి నిర్వహణలో లక్ష్యాలు నెరవేర్చాలని మిషన్– జీఈఆర్ విజయవంతం చేయాలని ఎంఈఓ ఎవీఎస్‌వీ ప్రసాద్ అన్నారు. దెందులూరు ఎంపీడీఓ ఏబీపీవీ లక్ష్మి అధ్యక్షతన మండల స్థాయి వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పాల్గొన్న ఎంఈఓ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్యతా లక్ష్యాలను ఉద్యోగులు గుర్తురెగి విధులు నిర్వహించాలన్నారు.

వరిలో ఎండాకు తెగులు ఉధృతం

దెందులూరు: జిల్లాలో వరి పంటపై ఎండాకు తెగులు ఉధృతంగా ఉందని, దీని నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏరువాక కేంద్రం ఏలూరు ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కే.ఫణికుమార్, కోఆర్డినేటర్ డాక్టర్ పీ.సుజాత, శాస్త్రవేత్త నాగేంద్రబాబు అన్నారు. మంగళవారం దెందులూరు, సానిగూడెంలో వరి పొలాలను వారు పరిశీలించారు. వరి నాట్లు వేసిన 25–30 రోజుల్లోపు ఆకులపై నుంచి కిందకు ఎండిపోవడం, ఆకులు పసుపు రంగులోకి మారడాన్ని గమనించాలన్నారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ ఉష్ణోగ్రతలు 26 శాతం అంతకన్నా తక్కువగా ఉండటం వల్ల, వర్షాలు ఎక్కువగా కురవడం వల్ల ఎండాకు తెగులు వస్తుందన్నారు. ఈ తెగులు వచ్చిన వెంటనే రైతులు యాజమాన్య పద్ధతులను పాటించాలన్నారు. నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలన్నారు. తెగులు ఆశించిన పొలాల్లో నీటిని ఎక్కువ రోజులు నిల్వ ఉంచకుండా బయటకు వదిలేయాలన్నారు. పొటాష్ ఎరువును 20 కేజీలు విధిగా వేయాలని, సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులను వాడాలన్నారు. కాపర్ హైడ్రాక్సైడ్ 20 గ్రాములు, ప్లస్ ప్లాంటామిజన్ 1.0 గ్రాములు, ఒక లీటరు నీటికి కలిపి వారం, పది రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులు అప్రమత్తంగా ఉండి వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలు పాటిస్తూ సాగు పనులు చేయాలని శాస్త్రవేత్తలు ఫణికుమార్, సుజాత, నాగేంద్రబాబు రైతులను కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	36
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	36
ఏలూరు – బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	35
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	25

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	21.45	4820	29
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	26
ఏలూరు –బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	27
ఏలూరు –జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4804	29
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	24
ఏలూరు –బీహెచ్‌ఈఎల్	08.00	4794	34
ఏలూరు – బీహెచ్‌ఈఎల్	22.15	34820	36
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు –విశాఖపట్నం	22.00	4838	34
ఏలూరు –తిరుపతి	16.00	4830	30

పంటలకు సమృద్ధిగా సాగు నీరు

- 12వేల ఎకరాలకు తొలగిన సాగునీటి ఇబ్బందులు
- పోలవరం కాలువ ద్వారా నీరు సరఫరా
- ఆయకట్టు రైతుల హర్షం



కొప్పులవారిగూడెంలో పోలవరం కాలువ నీటి విడుదలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి (ఫైల్)

దెందులూరు: మండలం పరిధిలోని 8 గ్రామాల్లోని 12 వేల ఎకరాల ఆయకట్టు భూముల్లో ఏటా రైతులు సాగునీటి ఇబ్బందులు ఎదుర్కొనేవారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహాయ సహకారాలతో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ఈ 12 వేల ఎకరాలకు సాగునీటి సమస్యను తొలగించడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.మండలంలోని సోమవరప్పాడు, ఉప్పుగూడెం, అలుగులగూడెం, సానిగూడెం, దెందులూరు, సత్యనారాయణపురం, కొమిరేపల్లి, సీతంపేట గ్రామాల్లో 12 వేల ఎకరాలకు సాగునీటి కోసం వీధి పోరాటాలు చేయాల్సి వచ్చేదని రైతులు అన్నారు. ఏటా సాగునీటి కోసం ఎదురుచూస్తూ సాగుకు చేపట్టాల్సి వచ్చేదని వారన్నారు. మండలంలోని రైతుల అవస్థలను ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించి పోలవరం కాల్వ ద్వారా సాగునీరు విడుదల చేయించడంతో పంటల సాగుకు నీటి ఇబ్బందులు తొలగిపోయాయని దెందులూరులో కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ కొలుసు గణపతిరావు, రైతులు మంగళవారం అన్నారు. మండలంలోని 12 వేల ఎకరాల ఆయకట్టు రైతులు, వారి కుటుంబ సభ్యులు, కూలీలు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, కొఠారు రామచంద్రరావుకు, సీఎం వైఎస్ జగన్‌కు రుణపడి ఉంటామన్నారు. విజయవాడ కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడివేదకుమారి, సీతంపేట సర్పంచ్ పరసా లక్ష్మిసుజాత, వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కోటిపల్లి సురేష్, కొవ్వలి సొసైటీ చైర్మన్ కొమ్మిన రాము, సత్యనారాయణపురం రైతు ఐనంపూడి రాము, దెందులూరు వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు పోకల రాంబాబు, పలువురు ఎంపీటీసీ సభ్యులు సాగునీరు విడుదల చేయినందుకు కృతజ్ఞతలు తెలిపారు.